


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్వాధీన పత్రిక

**ఇంటర్‌కంలో** వాచ్‌మేన్ చెప్పింది విని డైరెక్టర్ కె.కె సంజనతో చెప్పాడు.

"నువ్వు లోపలకి వెళ్ళు."

ఎదురు ప్రశ్న వేయకుండా సంజన లేచి ఆ హాల్ నించి లోపలకి ఉన్న తలుపు తోసి మరో పెద్ద హాల్లోకి వెళ్ళింది. ఆ ఇంటికి అంతకుమునుపు ఐదారుసార్లు వచ్చినా ఆమె ముందు గది దాటి లోపలకి రావడం ఇదే ప్రథమం.

ఆ విశాలమైన గదిలోంచి ఐదారు తలుపులు ఉన్నాయి. రెండు తప్పించి అన్ని మూసి ఉన్నాయి. తెరిచి ఉన్న ఓ గది వంటిల్లని అర్థమవుతోంది. ఇద్దరు ఆడవాళ్ళు నిశ్శబ్దంగా వంట చేస్తున్నారు. మరో గదిలో నేలమీద ఒక పెద్ద కేండిల్ వెలుగుతోంది. దాని పొడవేకాదు, కైవారం కూడా ఎక్కువే. గుండ్రంగా ఉన్న పెద్ద కేండిల్ పక్కనే ఓ స్త్రీ అటువైపు తిరిగి కూర్చుని ఉంది. ఆమె చీరకొంగుని తలమీద కప్పుకుంది. అది పూజగదని అర్థమైన సంజన ఏ దేవుడున్నాడో చూద్దామని ప్రయత్నించింది కాని కనపడలేదు.

కిచెన్ ముందు ఎనిమిది కుర్చీల డైనింగ్ టేబుల్, ఇవతలివైపు పొట్టిగా ఉన్న చిన్న సోఫాసెట్. మధ్యలో చిన్న టీపాయ్. హేండీ క్రాఫ్ట్స్‌లో అలాంటివి అమ్ముతారనుకుంది. ఓ కుర్చీలో కూర్చుని టీపాయ్ మీదున్న మేగజైన్ అందుకుంది. అదో ఫిలాసఫీ పత్రిక. పైగా ఇంగ్లీష్‌లో ఉంది. విసుగ్గా యథాస్థానంలో పడేసింది. ఆ చిన్న చప్పుడుకే పూజగదిలోని ఆమె నెమ్మదిగా ముందుకి వంగి నుదురు నేలకి తాకించి లేచి గదిలోంచి బయటకి వచ్చింది. సంజన సిగ్గుపడిపోయింది. అప్రయత్నంగా లేచి నుంచుని చెప్పింది.

"సారీ. ఎటు కదిలినా ఈ మువ్వలు చప్పుడు చేస్తున్నాయి."

టీపాయ్‌కి, కుర్చీలకి ఉన్న మువ్వలని చూపించి చిన్నపిల్లలా ఫిర్యాదు చేస్తున్న సంజనని నవ్వుతూ చూస్తూ ఆమె చెప్పింది.

"ఫర్లేదు. కూర్చోండి"

ఆమె కె.కె భార్యని తెలిసాక సంజన ఓ క్షణం ఆమె వంక చూసింది. సామాన్యంగా ఉంది. సన్నగా పొడుగ్గా ఫిట్‌గా ఉంది. నుదుటిమీద చిన్న నల్లబొట్టు. పొడవైన జుట్టు. కె.కెలాంటి రొమేంటిక్ పర్సన్‌కి తగిన భార్యకాదు అనుకుంది.

"నా పేరు సంజన. సర్ దగ్గర స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాను" తనని పరిచయం చేసుకుంది.

"ఓ" ఆమె ఆదరంగా నవ్వింది.

"ఇక్కడికి చాలాసార్లు వచ్చాను కాని లోపలికి రాలేదు. మిమ్మల్ని కలవలేదు" సంజన సంభాషణ పొడిగిస్తూ చెప్పింది.

"అవును. చాలామంది వస్తూంటారు. ఇంటిని, ప్రొఫెషన్‌ని కలపడం కె.కెకి ఇష్టం ఉండదు" ఆమె మృదువుగా చెప్పింది.

ఇంతలో తలుపు తోసుకుని వచ్చిన కుర్రాడు చెప్పాడు.

"అమ్మా ఐదు కాఫీలు."

ఆమె వంటగదివైపు చూసింది. వాడు కిచెన్‌లోకి వెళ్ళి చెప్పి బయటకి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడే వస్తాను" రెండు నిమిషాల తర్వాత మిసెస్ కె.కె లేచి వంటింట్లోకి వెళ్ళింది.

మరో నిమిషంలో ఇరవైఏళ్ళమ్మాయి కాఫీ కప్పులున్న ట్రేతో బయటకి వచ్చి సంజన ముందు ఆగింది. సంజన ఓ కప్ అందుకుంది. ఆ అమ్మాయి ట్రేతో బయటకి వెళ్ళిపోయింది. వెంటనే ఇందాకటి కుర్రాడు లోపలకి వచ్చాడు. కె.కె భార్య చేతిలోని కప్, సాసర్ అందుకుని వెళ్ళిపోయాడు. ఆమె వచ్చి సంజన ఎదురుగా కూర్చుంది.

"అదేంటి? మీరు వెళ్ళి కలిపారా కాఫీ?" సంజన ఆశ్చర్యంగా అడిగింది.

"ఒక్క కప్పే. తను నేను కలిపిన కాఫీ తప్ప వేరేది తాగరు" ఆమె నవ్వుతూ చెప్పింది.

సంజనకి ఛెళ్ళున కొట్టినట్లయింది. తన ఫ్లాట్‌లో ఎన్నోసార్లు కె.కె.ని అడిగింది. 'కాఫీ ఇవ్వనా?' అని.

'ఇప్పుడొద్దు మరోసారి' అని ఒకటే సమాధానం వచ్చేది. కారణం ఇదా? ఆమెకి ఉక్రోషంగా అనిపించింది.

'అంతేలే ఈవిడ కాఫీలు ఇవ్వడానికే సూటబుల్' అనుకుని సమాధానపడింది.

"సర్ సినిమాల్లో మీకేం ఇష్టం?" అడిగింది.

"ఇప్పటిదాకా తీసింది ఐదు సినిమాలేగా? ఛాయిస్ చాలా తక్కువ" ఆమె చిరునవ్వుతో చెప్పింది.

"నేను సర్ తీసిన మొదటి సినిమాకే ఫిదా అయిపోయాను. రెండో సినిమా చూడగానే ఇంక ఆగలేక సర్ వెంటబడి మొత్తానికి కలిసాను. డైరక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేర్చుకోమంటే, స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో చేరమన్నారు" సంజన ఉత్సాహంగా చెప్పింది.

"ఓ! వెరీ గుడ్. షూటింగ్‌లో అన్నీ గమనిస్తూండండి. మీరు డైరెక్ట్ చేసేప్పుడు ఈ అబ్జర్వేషన్ ఉపయోగపడుతుంది" కె.కె భార్య సలహా ఇచ్చింది.

"మీరెప్పుడైనా షూటింగ్‌కి వెళ్ళారా?"

"లేదు. నాకు వీలు కుదరదు."

ఇంటినిండా పనివాళ్ళుండి కూడా ఈవిడకి ఎందుకు కుదరదో అనుకుంది సంజన.

"ఏదైనా జాబ్ చేస్తున్నారా?" వెటకారం బయటకి ధ్వనించకుండా అమాయకంగా అడిగింది.

"ఓ.యూలో ఫిలాసఫీ రీడర్‌గా పనిచేస్తున్నాను" ఆమె చెప్పింది.

డిగ్రీ డిస్కంటిన్యూ చేసిన సంజన ఆ సమాధానానికి కొంచెం కించపడింది.

"అమ్మో! వేదాంతం మన ఒంటికి పడదు" నవ్వేసింది.

"మిమ్మల్ని నేర్చుకోమనలేదే?" కె.కె భార్య అదే చిరునవ్వుతో చెప్పింది.

"ఐనా సర్ అంత పెద్ద డైరెక్టర్. మీరింకా జాబ్ చేయడం ఏంటండి?"

"అది సర్ వృత్తి. ఇది నా వృత్తి. నాకు టీచింగ్ అంటే ఇష్టం. కె.కె కూడా ఎప్పుడూ ఈ విషయం మాట్లాడరు."

సంజనకి ఇక ఏం మాట్లాడాలో తెలీలేదు. కె.కె ఎన్నో రాత్రులు తనింట్లో గడిపాడు. నువ్వు అంటాడు. నా స్ట్రెస్‌కి నువ్వు మందు అంటాడు. కాని ఎంత రాత్రయినా ఇంటికి వెళ్ళిపోతాడు. ఈవిడ చెప్పే పాఠాలు భరించలేకేమో తనింట్లో ఆల్కహాల్ తాగుతాడు. కాఫీ మాత్రం తాగడు. 'డిస్‌గస్టింగ్' అనుకుంది.

ఆయనకి తనంటేనే ఇష్టం. తనతో ఏకాంతంగా ఉన్నప్పుడు పారవశ్యంతో ' మిత్ర్ మై ఫ్రెండ్' అని కలవరిస్తాడు.

సంజనకి కొద్దిగా గర్వంగా అనిపించింది. వరసగా ఐదు హిట్ సినిమాలు తీసిన డైరెక్టర్‌కి తనంటే ఇష్టం. భార్యకన్నా కూడా.

"నా గురించి సర్ మీకేం చెప్పలేదా?" అపనమ్మకంగా అడిగింది.

'సంజన అనే అందగత్తె, తెలివైన అమ్మాయి నా ఫేన్, ఇప్పుడు స్టాఫ్' అని చెప్పకుండా ఉండగలడా కె.కె?

ఆమె తల అడ్డంగా ఊపి చెప్పింది "ఇంట్లోకి ఆఫీస్‌ని తేవడం తనకిష్టం ఉండదని" చెప్పాగా.

సంజనకి మళ్ళీ ఉక్రోషంగా అనిపించింది. తన స్థానం అర్ధమైనట్లుగా కూడా ఉంది. కె.కె ఒక మేధావి, ఒక అద్భుతం. అలాంటి వ్యక్తికి ఉపశమనంగా ఉపయోగపడుతున్నందుకు కొంచెం సంతోషంగా ఉన్నా, ఎక్కువ కన్ఫ్యూజన్‌లో ఉంది. కె.కె ఇంట్లో తన స్థానం కేవలం డ్రాయింగ్ రూం వరకే.

ఏ మాత్రం ఆకర్షణలేని ఈవిడకోసం ఎంత రాత్రయినా ఇంటికి వచ్చేస్తాడు. ఆవిడ తయారు చేసిన కాఫీనే తాగుతాడు. తను ఎప్పటికి అసిస్టెంట్ డైరెక్టరై, ఎప్పటికి అసోసియేట్, ఎప్పుడు డైరెక్టర్ అవుతుంది? తన భవిష్యత్ ఏమిటి? ఈవిడ ఎంత నిశ్చింతగా ఉంది. ఆ ప్రశాంతత తనకేది?

"మీరు ఇందాక ప్రే చేసిన దేవుడెవరండీ? కనిపించలేదు?" అడిగింది.

"ఎవరూ లేరు. దీపమే" ఆమె చెప్పింది.

"దీపమా?" సంజన అయోమయంగా అడిగింది.

"అదే నిరాకార పరబ్రహ్మ అనుకోండి. జ్యోతిలో దేవుడ్ని స్మరించుకుంటాను."

సంజనకి ఏమీ అర్ధంకాలేదు. "నేను దేవుడ్ని నమ్ముతాను కానీ పూజలు చేయను" చెప్పింది.

"పర్లేదు. మీ ఇష్టం మీది" కె.కె భార్య చెప్పింది.

కుర్రాడు ఖాళీ కప్పులతో వచ్చాడు.

"మేడం! మిమ్మల్ని రమ్మంటున్నారు" సంజనతో చెప్పాడు.

సంజన లేచి నిలబడి కె.కె భార్యతో నవ్వుతూ చెప్పింది "వెళ్ళొస్తానండి. ఇంతసేపు మాట్లాడుకున్నా మీ పేరు తెలుసుకోలేదు నేను."

"మిత్ర" కె.కె భార్య చిరునవ్వుతో చెప్పింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments